## స్త్రీవాద కథ




# విడ్డూరపు మనిషి

ఓ. రేణుకాదేవి

"నువ్వు విడ్డూరపు మనిషివి నువ్వెప్పుడు విడ్డూరంగా ఆలోచిస్తావు" అంటుంటాడు నన్ను మా ఆయనెప్పుడూ ఆయనే కాదు మా అత్తగారు అప్పుడప్పుడు అంటుంటారు చిన్నప్పుడు మా తల్లి దండ్రులూ అనేవారు. బహుశా మా పిల్లలు కూడా మనసులో అనుకుంటారేమో అందరికీ ఎందుకన్పిస్తుందో నాకర్థం కాదు. అవునూ మీక్కూడా నేను విడ్డూరపు మనిషిలాగే అన్పిస్తున్నానా? ఓహ్! క్షమించండి నాగురించి మీకేమీ తెలియదు కదూ. సరీ అయితే నాగురించి చెప్తాన వినండి. నేను చెప్పేది విన్నాక మీర ఆలోచించండి.

నిజానికి నల్గురికీ చెప్పేంత గొప్పదేమీ కాదు నా జీవితం. నేను అందరిలా పుట్టాను అందరిలాగే పెరిగాను అంద లాగే బ్రతుకుతున్నాను. మరి నన అందరూ విడ్డూరంగా ఎందుకు చూస్తా నాకర్థం కాదు. అందుకే నా జీవితం గురిం



ునా మీకు చెప్పాలనుకుంటున్నాను.
ా చిన్నతనంలో నేను బాగా చదువు
ఉద్యోగం చేయాలని కోరుకుంటూ
దాన్ని నేనలా. కోరుకోవడానికి ఓ
ం ఉంది. నేను మా అమ్మ,
మ్మ, ఇంకా ఇరుగు పొరుగు ఆడ
ను చూస్తూ ఉండేదాన్ని వాళ్ళ
లన్నీ ఒకే మూసలో పోసినట్లుగా
ంచేది నాకు ఎప్పుడూ వండటం,
ం, తోమడం, ఉతకడం. భర్తకు


పిల్లలకూ సేవలు చేయడం; భర్త కొట్టినా తిట్టినా బాధ పడటం..తరుచుగా పిల్లలను కేకలేయడం, కొట్టడం ఎప్పుడూ ఇవే పనులు యంత్రాల్లా చేస్తూనే ఉండేవారు. నాకు మొదట్లో ఈ పనులన్నీ మామూలుగానే అన్పించేది. కానీ ఓరోజు మావూరికి కొత్తగా ఓ టీచరమ్మ వచ్చారు. ఆమె మా ప్రక్కింటిలోనే ఉండేవారు. ఆమె భర్త వేరే ఊళ్లో ఉద్యోగం చేసేవారు. పిల్లలుకూడా పట్నంలో హాస్టల్‌లో ఉండి చదువుకునే

వారు. అందుచేత టీచర్ వంటరిగా ఉండేవారు. ఆమె ఎప్పుడు చూసినా ఏదో చదువు కుంటూ వ్రాసుకుంటూ కనబడే వారు. ఎవ్వరితోనైనా నవ్వుతూ చక్కగా మాట్లాడేవారు. ఆడ, మగ ఎవరైనా టీచర్‌తో చాలా గౌరవంగా ప్రవర్తించేవారు. మావూరి ప్రెసిడెంటుతో కూడా టీచర్ మామూలుగా నవ్వుతూ మాట్లాడే వారు. మా అమ్మ, ఇంకా ఇరుగుపొరుగు మ్మలెవరైనా పరాయి మగవాళ్ళని చూస్తే భుజాల చుట్టూ కొంగు కప్పుకుంటూ

పక్కకు తప్పుకునే వారు. కానీ టీచర్ ప్రెసిడెంటుతోనైనా ఎదురుగా నిలబడి మామూలుగా నవ్వుతూ మాట్లాడటం చూస్తే నాకు ముచ్చటేసేది. నాకు క్రమంగా మా అమ్మలాంటి వాళ్ళ జీవితాలు పట్ల విసుగూ టీచర్ జీవితం పట్ల ఆకర్షణా కలిగాయి. టీచర్‌కు ఆ గౌరవం ఆమె చదువు ఉద్యోగం వల్లేనని అనుకునేదాన్ని అందుకే నేను బాగా చదువుకోవాలని ఉద్యోగం చేయాలని కోరుకున్నాను. అయితే నా కోరికను ఓ విడ్డూరపు కోరికలా భావించి మా నాన్న నాకు హైస్కూల్ చదువు కూడా పూర్తికాకుండానే పెళ్ళి చేసాడు. పెళ్లై ఈ పట్నానికి వచ్చాక రోజు కాలేజీలకు, ఉద్యోగాలకు వెళ్లే ఆడవాళ్ళను చూసి ఎంతో ముచ్చట పడి పోయేదాన్ని. నేనలా చదువుకో లేక పోయినందుకు బాధ పడుతూ ఉండేదాన్ని.

నాకిప్పుడు ముగ్గురు పిల్లలు ఒక మ్మాయి, ఇద్దరబ్బాయిలు. నేను మొదటి సారి గర్భవతి నైనప్పుడు ఆడపిల్ల పుడితే బావుండుననే నా కోరిక విని మా ఆయన "ఇదేం విడ్డూరపు కోరిక మొదటిసారి మగపిల్లాడు పుట్టాలని కోరుకోక" అన్నాడు. నేను ఆడదాన్నై ఉండీ మరో ఆడపిల్లకు జన్మ నివ్వాలను కోవడంలో విడ్డూరం ఏముందో నాకిప్పటికీ అర్థం కాదు. ఆడపిల్ల పుట్టాలనీ, నా తీరని కోరికలను నా కూతురు ద్వారానైనా తీర్చుకోవాలని నా ఉద్దేశం. కానీ రెండో కాన్పుకి కానీ నా కోరిక తీరలేదు. పాప పుట్టిందని తెలియగానే నేనెంత సంతోషపడిపోయానో. నిజానికి నాకప్పుడే సంపూర్ణ మాతృత్వం పొందినట్లని పించింది. నా కోరికలను తీర్చడానికే విజయ పుట్టిందనుకున్నాను. పెరిగి పెద్దదవుతోన్న విజయను చూసి నేనెంత మురిసి పోయేదాన్నో. కాలేజికి, ఉద్యోగానికి వెళ్లే ఏ ఆడపిల్లను చూసినా "నా విజ్జీ కూడా ఇలా చదువుకుంటుంది, ఇలా ఉద్యోగం చేస్తుంది" అనుకునేదాన్ని. నా ఆశలకు తగ్గట్టే విజ్జీ చదువులో చురుగ్గా ఉండేది. మా అబ్బాయిలు కూడా చదువులో చురుకైనా వారే. రోజురోజుకూ పెరిగి పెద్దవుతోన్న పిల్లల్ని చూసి నేను సహజంగానే సంతోషించేదాన్ని. కానీ దాని పెరుగుదలను చూసి మా ఆయన, అత్తగారు దిగులు పడేవారు. "ఈ వయసుకే ఇది ఇంతలా పెరుగుతుందేమిటే అంటూండే వారు మా అత్తగారు. ప్రకృతి సహజమైన పెరుగుదలను చూసి ఎందుకు బాధ పడతారో నాకర్థమయ్యేది కాదు.

నేను నా ముగ్గురు పిల్లల్ని అన్ని విషయాల్లోనూ సమానంగా చూసేదాన్ని. నేనెప్పుడూ వాళ్ళ ఇష్టాయిష్టాలకు అను గుణంగా నడుచుకునే దాన్ని. విజయ పదమూడేళ్ళ వయసులో ఉండగా ఓ సంఘటన జరిగింది.




ఆరోజు రాత్రి మా అత్తగారు, ఆయన, పిల్లలు కూర్చొని భోజనం చేస్తున్నారు. పాప రెండు ముద్దలు తిని "నాకీకూర సహించట్లేదమ్మా!" అంది. "అయితే ఓ నిమిషం ఆగమ్మా!" అంటూ నేను స్టవ్ వెలిగించి గబగబా ఓ ఆమ్లెట్ వేసి దాని కంచంలో వేసాను. ఆమ్లెట్టంటే విజ్జీకి చాలా యిష్టం. నేను ఆమ్లెట్ వేస్తుంటే మా ఆయన, అత్తగారు నావైపు విడ్డూరంగా చూడటం నా దృష్టిని దాటి పోలేదు. రోజూలాగానే పిల్లలు త్వరగా భోజనం ముగించి లేచి వెళ్ళి పోయారు. ఇక మా ఆయన మొదలెట్టాడు.

"పిల్లలు ఏదుంటే అది సర్దుకుపోయి తినేలా చూడాలిగానీ వాళ్ళు కోరిందల్లా చేసిపెడితే ఎలా" అన్నాడు. ఆయన దృష్టిలో 'పిల్లలు' అంటే 'ఆడపిల్లట అని అర్థం కాబోలు! ఎందుకంటే నేను మా అబ్బాయిల విషయంలో కూడా అలాగే చేస్తాను. కానీ వాళ్ళ విషయంలో ఏమి అనని మా ఆయన అమ్మాయి విషయంలోనే అభ్యంతరం చెప్తున్నాడు.

"అది పొట్లకాయ కూర సరిగా తినదండీ! ఆమ్లెట్ ఉంటే దానితోపాటు కూరకూడా తినేస్తుంది" చెప్పాన్నేను.

"ఇప్పుడయితే నువ్వు కోరిందల్లా చేసి పెట్టావు బాగానే వుంది. కానీ రేపు అది అత్తారింటికి వెళ్ళాకా కోరినవన్నీ ఎవరు చేసి పెడతారూ. ఇక్కడ కమ్మగా తినడం అల వాటయ్యాక అక్కడ బాధ పడొద్దూ!' ' అని మా అత్తగారు అందుకున్నారు.

"అయితే ఎప్పుడో వెళ్లే అత్తగారింటి కణువుగా నాకూతుర్ని ఇప్పట్నించీ సన్నద్ధం చేయాలా. ఎప్పుడో భవిష్యత్తులో అత్తారింట్లో దొరకదని దాన్నిప్పుంట్నుంచే పస్తు పెట్టాలా" చురుగ్గానే అన్నాన్నేను.

నా మాటలు మా ఆయనకు కోపాన్ని తెప్పించాయ్. "నీ కసలు ఆడపిల్లల్ని పెంచే విధానం తెలియదు" అన్నాడు.

"నాకు నిజంగానే తెలియదు. ఆడ పిల్లల్నొకలాగా, మగపిల్లల్నొకలాగా పెంచాలనీ" కాస్త విసురుగానే అన్నాను నేను.

మా ఆయనకు కోపం వచ్చి అన్నం మధ్యలోనే చేయికడుక్కొని లేచి "చూడూ! అది నీకు మాత్రమే కూతురు కాదు. దాని మీద నాకు ప్రేమలేదనుకోకు. ముందు ముందు సమస్యలు రాకుండా ఇప్పటి నుండి జాగ్రత్తపడటం మంచిది" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

అతను భోజనం మధ్యలోనే చేయి కడుక్కుంటుంటే నేనేమీ వాదించలేదు. ఆయన అన్నం పూర్తిగా తిననందుకు నేనేమీ బాధపడలేదు. నేను చిన్న చిన్న కోరికలను తీర్చుకోవడం కోసం ఎన్ని పూటలు తిండి మానేయలేదనీ!

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మా ఆయనక్కూడా విజ్జీ అంటే ప్రేమే. ఆయన ఏ వూరికెళ్ళినా అబ్బాయిలకేం తెచ్చినా తేకపోయినా అమ్మాయికి మాత్రం గాజులో రిబ్బన్లో ఏవో ఒకటి తెచ్చేవారు. అలాంటి దాయనకు ప్రేమలేదని ఎలా అను కుంటాను కానీ ఆయన ప్రేమ హద్దులు

పెడుతుంది. పిల్లలకు హద్దులు అవసరం లేదని నేననుకోనుగానీ, మగపిల్లలకు అవసరం లేని హద్దులు ఆడపిల్లలక్కూడా అనవసరమని నా ఉద్దేశం. ముందు ముందు సమస్యలు రాకుండా జాగ్రత్త పడటం కన్నా, మగపిల్లలనయినా, ఆడపిల్లలనయినా ఏ సమస్యలు వచ్చినా ఎదుర్కొనేలాగా పెంచాలని నా అభిప్రాయం.

ఆరోజు విజ్జీ పదోతరగతి రిజల్ట్స్ వచ్చిన రోజు. అది ఫస్ట్ క్లాసులో పాసయ్యిందని తెలిసి నా ఆనందానికి అవధులు లేవు. ఎంత హడావుడి చేసానో అందరికీ స్వీట్లు పంచాను. నాకలలు తీరే రోజు దగ్గర్లోనే ఉన్నట్టనిపించింది. ఆ రోజు రాత్రి నాకు 'సంతోషంతో నిద్ర పట్టలేదు. విజ్జీని కాలేజీలో చేర్పించాలి... మంచి మంచి డ్రెస్సులు కొనాలి... ఇలా ఎన్నెన్నో ఆలోచనలు మా ఆయనకూడా మెలుకువతోనే ఉండి ఏదో ఆలోచిస్తున్నట్టు గమనించాన్నేను.

"ఏంటండీ! నిద్రపోవడం లేదు ఏమాలోచిస్తున్నారు?" అడిగాను.

"నా ఫ్రెండ్ రాజారావు లేడూ అతనికి తెల్సిన వాళ్ళబ్బాయి ఏదో మంచి ఉద్యోగంలో ఉన్నాడట. మీ అమ్మాయికి చూస్తే బావుంటుందీ సంబంధం అన్నాడు ఆ విషయమే ఆలోచిస్తున్నాను" చెప్పాడాయన.

ఆయన చెప్తుందేంటో కొన్ని క్షణాలు అర్థం కాలేదు నాకు. "అమ్మాయికి సంబంధం చూడటమేమిటి" అన్నాను ఆశ్చర్యంగా.

"అది యుక్తవయస్కురాలై రెండేళ్ళయింది. పదోతరగతి కూడా పాసయింది. రోజురోజుకూ కట్నాలు పెరిగి పోతున్నాయి కాబట్టి ఎంత త్వరగా పెళ్ళి చేస్తే అంత మంచిదని భావిస్తున్నాను" అన్నాడు మా ఆయన ఆలోచనగా.

నిర్ఘాంతపోయాను నేను. ఇరవయేళ్ళ క్రితం మా నాన్న ఎలా ఆలోచించాడో ఇప్పుడు మా ఆయన అలాగే ఆలోచిస్తున్నాడని పించింది. "మీకేమన్నా మతిపోయిందా ముక్కుపచ్చలారని పిల్లగానికిప్పుడు పెళ్ళి చేసి గొంతు కోస్తాననంటామిటీ" కాస్త కోపంగానే అన్నాను.

"నేను శుభమా అని పెళ్ళి చేస్తానంటే నీకు గొంతు కోయడంలాగా కనబడుతుందా" ఆయనా కోపంగానే అన్నాడు.

"కాక మరేమిటీ! దాని పెళ్ళికిప్పుడు తొందరేమొచ్చింది. అది హాయిగా చదువుకుంటోంది కదా ఈ సంవత్సరం కాలేజీలో చేర్పిద్దాం" అన్నాన్నేను కోపాన్ని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ.

కాలేజీ చదువు చదివి ఏం చేస్తుందీ సమయము డబ్బు దండగ" అన్నాడాయన. ఆ మాటకి నేను కోపాన్ని అదుపులోకి తెచ్చుకోగలిగాను. "అలా మాట్లాడుతారేమిటండీ! ఈ రోజుల్లో ఎంతమంది ఆడపిల్లలు పెద్దచదువులు చదవటం లేదూ! అది కూడా చక్కగా చదువుకొని ఏదైనా ఉద్యోగంలో చేరి దానికాళ్ళమీద అది నిలబడుతుంది. తర్వాతే పెళ్ళి గురించి ఆలోచిద్దాం". సాధ్యమయినంత వరకు అనునయంగా చెప్పాన్నేను.

"చూడు! చదువు ఉద్యోగం అంటే మాటలనుకుంటున్నావా. ఎంత డబ్బు ఖర్చవుతుంది చెప్పు. మనకింకా ఇద్దరు పిల్లలున్నారు. వాళ్ళ చదువులకీ డబ్బు ఖర్చవుతుంది. మగపిల్లలు చదువులకు ఖర్చు పెట్టామంటే అర్థముంది. రేపు వాళ్లు మనల్ని పోషిస్తారు. పైగా మనం పెట్టిన ఖర్చంతా వరకట్నం రూపేణా వడ్డీతో సహా మనకొస్తుంది. కానీ ఆడపిల్లను చదివించామనుకో దాని చదువుకీ వేలు ఖర్చు పెట్టాలి. ఎంత చదివినా ఉద్యోగం చేసినా కట్నం ఇవ్వకా తప్పదు కదా! అంతేకాదు చదువు పేరిట పెళ్ళి ఆలస్యం అవుతుంది. అప్పటికి కట్నాలు కూడా బాగా పెరుగుతాయి. ఇంత ఖర్చును భరించే స్తోమత నాకు లేదు. కాబట్టి విజ్జీకి వీలైనంత త్వరలో పెళ్ళి చేయాలనుకుంటున్నాను" మా ఆయన చాలా వివరంగా, నిశ్చయంగా చెప్పారు

"లేదు లేదు దానికి పెళ్ళి చేస్తానంటే నే నొప్పుకోను అది బాగా చదివి ఉద్యోగం చేయాలి. నా కల ఫలించాలి దయచేసి దాని పెళ్ళి మాట ఎత్తకండి" అర్థించే ధోరణిలో అన్నాన్నేను.

"నీదంగా విడ్డూరం కాకపోతే ఉద్యోగం చేసే ఖర్మ దానికేం పట్టిందే. చేసుకొనే వాడు దాన్ని పోషించడా" విసుగ్గా అన్నాడు మా ఆయన.

"ప్రతిదానికి మొగుడి మీద ఆధారపడే బ్రతుకు నా కూతురికొద్దు. తను తన కాళ్ళమీద నిలబడగలగాలి. అది వ్యక్తిత్వం ఉన్న మనిషిగా ఎదగాలి. ఆ తర్వాతే పెళ్ళి" స్పష్టంగా చెప్పాన్నేను.

కానీ మా ఆయన నామాటలు చెవిన పెట్టలేదు. కని పెంచిన నాకంటే మా ఆయనకే అమ్మాయి మీద అధికారం ఉండటం నాకు విచిత్రమనిపించింది. ఆయనకు చెప్పి లాభం లేదని మా అమ్మాయికే చెప్పాను, నాన్నను ఎదిరించమనీ పెళ్ళి చేసుకోనని చెప్పమని.

కానీ ఇరవయేళ్ళ క్రితం మా నాన్న నిర్ణయానికి ఎదురు చెప్పకుండా నేను తలవంచాను. ఇప్పుడు మా అమ్మాయీ తలవంచింది.

నా ఆశలు నిరాశలయి కలలు కల్లలయి మా అమ్మాయి పెళ్ళై పోయింది. అల్లుడిగారికి ఇక్కడే ఉద్యోగం. వాళ్ళ అమ్మానాన్నలతో ఇక్కడే ఉంటారు. ఆటోలో వెళ్తే అరగంట ప్రయాణం వాళ్ళింటికి. కానీ నేను వాళ్ళింటికి ఎప్పుడోగానీ వెళ్లేదాన్ని కాదు. విజ్జీ మాత్రం పండగలకూ పబ్బాలకూ వచ్చేది. వచ్చినప్పుడు వంటింట్లో పనిచేసు కుంటున్న నా దగ్గరకొచ్చి ఏవేవో కబుర్లు చెప్తూ కూర్చునేది. అత్తగారింటి పద్ధతుల గురించి, అత్తగారి మాటకారి తనం గురించి వాళ్ళాయన ఇష్టాయిష్టాల గురించి, కోపతాపాల గురించి ఉత్సాహంగా చెప్తూ ఉండేది. కానీ ఎందుకో ఆ కబుర్లు నాకు ఏమాత్రం ఆసక్తిని కలిగించేవి కావు. నేను అనాసక్తిగా వింటూ పనులు చేసుకునేదాన్ని. నిజంగా చెప్పాలంటే విజ్జీ పెళ్ళయ్యాక నాలో ఒకలాంటి స్తబ్ధత వచ్చేసింది.

నా అనాసక్తిని గమనించి క్రమక్రమంగా అమ్మాయి నాతో కబుర్లు చెప్పడం తగ్గించి మా అత్తగారితో చెప్తూ ఉండేది. మా అత్తగారు ఆ కబుర్లు ఆసక్తిగా వింటూ మధ్యమధ్యలో కుతూహలంగా ఏదో ఒకటి అడుగుతూ దాని ఉత్సాహాన్ని పెంచేవారు.

అప్పటికి మా విజ్జీ పెళ్ళయి ఇంకా సంవత్సరంకానేలేదు. ఓరోజు మా ఆయన ఇంట్లో కొస్తూ "ఓయ్! ముసలమ్మా" అని పిలిచారు నన్ను.

ఆ సంబోధనకు కాస్త ఆశ్చర్యపోయి "ఏంటీ! నేనప్పుడే ముసలిదాన్నైపోయానా' 'అన్నాను నవ్వుతూ. చాలా రోజుల తర్వాత మా ఆయనకు నా పెదాలమీద నవ్వు కన్పించి ఉంటుంది. అందుకే మరింత

ఉత్సాహంగా "మునలమ్మవు కాక మరేమిటోయ్ త్వరలో అమ్మమ్మవు కాబోతుంటేనూ అన్నాడు.

ఆయన మాటలు అర్థం కాగానే నా పెదాలపై నవ్వు టక్కున ఎగిరిపోయింది "ఏమిటీ! మీరంటున్నది" అన్నాను.

"ఈ రోజు విజ్జిని చూడడానికి వెళ్ళినప్పుడు తెలిసింది నాకీ శుభవార్త" అన్నాడాయన.

"అయ్యో! దానకింకా పదిహేడేళ్ళయినా నిండలేదు అప్పుడే గర్భవతైతే దానారోగ్యం పాడైపోద" అదుర్దాగా అన్నా నేను.

నా మాటలకు మా ఆయన చిరాకు పడ్డారు. "ఏ తల్లైనా కూతురు గర్భవతైందంటే సంతోషపడుతుంది. కానీ నువ్వేమిటీ బాధ పడిపోతున్నావు. నీ అంత విడ్డూరపు మనిషిని నేనెక్కడా చూడలేదు. అయినా పదహారేళ్ళకే నువ్వు తల్లివి కాలేదా?" అన్నాడాయన.

ఆయన మాటలకు నేనేమీ సమాధానం చెప్పలేదు. నా జీవితంలాగా నా కూతురు జీవితం ఉండకూడదని ఎంత కోరుకున్నాను. కానీ దాని జీవితం నా జీవితం కంటే ఏ మాత్రం భిన్నంగా లేదనిపించింది.

అలా ఓ రెండేళ్ళు గడిచిపోయాయి. మా పెద్దబ్బాయి డిగ్రీ లోకి, చిన్నబ్బాయి ఇంటర్‌లోకి వచ్చాడు. విజ్జి ఇద్దరు పిల్లల తల్లయింది. అమ్మాయి పిల్లలు వచ్చినప్పుడు మా యింట్లో అందరికీ పండగలా ఉండేది. పిల్లలను ఎత్తుకొని మురిసిపోతూ అందరూ ఆనందంగా ఉండేవారు. కానీ నేను మాత్రం ఎప్పటిలా ముభావంగా ఉండేదాన్ని పిల్లల పనులన్నీ మొక్కుబడిగా చేసేదాన్ని వాళ్ళ నవ్వుల కేరింతలు ఏవీ నాస్తబ్ధతను కరిగించలేకపోయాయి. నాలోని మార్పుకు మా ఆయన పిల్లలు అలవాటు పడ్డారు. నా స్తబ్ధత పోగొట్టడానికి వాళ్లేమీ ప్రయత్నించే వాళ్లుకాదు. నన్ను దాదాపు పట్టించుకోవడం మానేశారు. ఒకలాంటి విరక్తితో నేను జీవితాన్ని గడుపుతున్నాను. అప్పుడు నాకింక ఏ కోరికలు లేవు. ఏ ఆశలూ లేవు, ఏ లక్ష్యాలు లేవు. ఏలాగో ఒకలా రోజులు వెళ్ళదీయటమే నాలక్ష్యం. ఇక నా జీవితం అలాగే స్తబ్ధంగా గడిచిపోయేదేమో! నా స్తబ్ధతను బ్రద్దలు కొటే రోజు వస్తుందని నేనెప్పుడు ఊహించలేదు. కానీ వచ్చింది!

ఆ రోజును నేనెన్నటికీ మరచిపోలేను.

ఇంటిముందు ఆటో శబ్దాన్ని నేను పట్టించుకోలేదు. ఆటోదిగి ఇంట్లోకి వచ్చిన మా ఆయన మమ్మల్ని చూడగానే భోరుమని ఏడ్చాడు. నాకు ఆశ్చర్యమనిపించింది. మా ఆయన ఏడ్వగా నేను చూడ్డం అదే మొదటిసారి.

"ఏమయిందిరా!" మా అత్తగారు అడిగే సారు.

"కొంప మునిగిందే అమ్మా! అల్లుడు స్కూటరు మీద వెళ్తుంటే లారీ గుద్దేసిందంట. అక్కడికక్కడే ఘోరం జరిగిపోయింది. నా కూతురు బతుకు నట్టేట మునిగింది. గుండె బాదుకుంటూ చెప్పాడు మా ఆయన.

ఆయన మాటలు అర్థం కావడానికి నాకు కొన్ని క్షణాలు పట్టింది. అర్థమయ్యాక 'నాగుండె ఇంకా ఎందుకు ఆగిపోలేదా' అని ఆశ్చర్యపోయాను. మా ఆయన్ని పట్టుకొని మొదటిసారిగా స్వేచ్ఛగా గట్టిగా ఏడ్చాను. మరికొన్ని నిమిషాల్లో మేమందరం ఆటోలో ఉన్నాం. ఆటో వెళ్తుంటే నేను కాస్త దుఃఖం నుంచి తేరుకొని విజ్జి గురించి ఆలోచించసాగాను. అమాయకమైన దాని మొహం నాకు మాటిమాటికీ గుర్తు రాసాగింది. విజ్జీ! అమ్మను నేనొస్తున్నానురా నిన్నూరడించ డానికి" కన్నీళ్ళు వత్తుకుంటూ అను కున్నాను.

ఆటోదిగి ఇంట్లోకి వెళ్లాము. మూర్తీభవించిన శోకంలా ఉంది నాకూతురు. నన్ను చూడగానే "అమ్మా!" అని బావురుమంది. నేను రెండు చేతులతో విజ్జిని చుట్టేసి గుండెలకు హత్తుకున్నాను. దాన్నేమని ఊరడించాలో నాకు మాటలు రాలేదు.

"అమ్మా! నేనింక ఎలా బ్రతకాలమ్మా? ఎందుకు బ్రతకాలమ్మా? ఆయన్తోపాటు నేనూ చచ్చిపోతానమ్మా" అంటూ హృదయ విదారకంగా ఏడుస్తోంది విజ్జి.

నాగెండెనెవరో ఉక్కుపిడికిలితో కర్కశంగా పిండినట్లు అన్పించిందినాకు. 'అయ్యో! భర్త లేకపోతే దానికిక బ్రతుకే లేదనుకుంటోంది" అనుకున్నాను బాధగా.

"అయ్యో! అలా అంటే ఎలా తల్లీ నీ పిల్లల్ని చూడు వాళ్ళకోసమైనా నువ్వు ధైర్యం తెచ్చుకొని బ్రతకాలి" అందో పెద్దావిడ.

"ఇన్నాళ్లు భర్తకోసం ఇక నుంచీ దాని జీవితం పిల్లల కోసమేనా" నా మనసు ఆక్రోశించింది.

"అమ్మాయి వీపు నెమ్మదిగా తడుతూ దృఢంగా చెప్పాను. "విజ్జీ! ఎవరి కోసమో కాదమ్మా నువ్వు నీ కోసమే బ్రతకాలి. నీకింకా ఇరవయ్యేళ్ళన్నా నిండలేదు. ఎంతో భవిష్యత్తుంది నీకు. ధైర్యంగా బ్రతకాల్నీ నీ జీవితం నీ కోసమే ఎవరి కోసమోకాదు' ' అని.

నా చుట్టు ప్రక్కల ఉన్న అమ్మలక్కలు నావైపు విడ్డూరంగా చూసారు. అంత దుఃఖంలోనూ నాకూతురు తలెత్తి నా కళ్ళలోకి చూసింది.

ఆ తర్వాత జరగాల్సిన తతంగాలన్నీ జరిగిపోయాయి. కర్మకాండల ముగిసాక విజ్జిని మా ఇంటికి తీసికెళ్ళాలన ఉద్దేశంతో నేనింకా అక్కడే ఉన్నాను. తనను వదిలి వెళితే ఇరుగుపొరుగు అమ్మలక్కలు వాళ్ళ సానుభూతి మాటలతో ఆమెనింకా అధైర్య పడుస్తారనే భయంతో కూడా నేనక్కడే ఉండిపోయాను. పైగా నేనుంటే తనకి ధైర్యంగా కూడా ఉంటుందనుకున్నాను.

కర్మకాండ దగ్గర పడుతుందనగా ఓ రోజు అల్లుడిగారి సహోద్యుగులు వచ్చారు పరామర్శకోసం వాళ్ళామాట ఈ మాట మాట్లాడి 'విజయగారికి డిగ్రీ ఉంటే బావుండేది శేఖర్ ఉద్యోగం తన కొచ్చేది' ' అన్నారొకరు.

"ఇప్పటికైనా ఫర్వాలేదు క్లర్క్ పోస్ట్ ఇస్తారు" అని మరొకరు అన్నారు.

"ఇప్పుడది ఉద్యోగం ఏం చేస్తుందిలే బాబూ" అన్నారు విజయ అత్తగారు.

"దానికుద్యోగం చేయాల్సిన ఖర్మేమీ పట్టలేదులెండి. దాన్ని చూసుకోవడానికి మేం లేమా?" అన్నారు మా ఆయన.

రెండు మూడు రోజులునుండి నేనావిషయం ఆలోచిస్తూనే ఉన్నాను. కానీ ఎవరిముందు బయట పెట్టలేదు. ఇక ఆరోజు సందర్భం వచ్చింది కదాని అమ్మాయితో "విజ్జీ! నువ్వుద్యోగంలో చేరితే బావుంటుందమ్మా!" అన్నాను.

"నేనా! ఉద్యోగమా? నా బ్రతుక్కి ఇప్పుడదొక్కటే తక్కువయింది? నేను చేయలేనమ్మా" నిరాశగా అంది విజ్జి.

"విజ్జీ! అంత నిస్పృహగా మాట్లాడ

కమ్మా. నాదృష్టిలో నువ్విన్నాళ్లు గడిపింది బాల్యమే. నీ యవ్వనం వృద్ధాప్యం అన్నీ ఇంకా ముందున్నాయి. ఎన్నాళ్ళని ఇలా మూల కూర్చొని ఏడుస్తావు. నువ్వెక్కడయితే నీ జీవితాన్ని పోగొట్టుకున్నావో అక్కడే మళ్లీ జీవితం కొరకు వెతుక్కో. కొత్త జీవితాన్ని ప్రారంభించమ్మా. పుట్టింటిపైనో మెట్టినింటిపైనో ఆధారపడి బ్రతుకడం చాలా కష్టం. బాగా ఆలోచించుకోమ్మా” అంటూ చాలా వివరంగా చెప్పాన్నేను.

నా మాటలకు కన్నీళ్లు తుడుచుకొని ఆలోచనలో పడిపోయింది విజ్జీ. తను సరైన నిర్ణయమే తీసుకుంటుందని నాకనిపించింది ఆక్షణం.

ఆపదోరోజు కర్మకాండ చేయాలని నిర్ణయించారు. ఆదేరోజు విజయను విధవను చేయాలని కూడా నిర్ణయించుకున్నట్టున్నారు. కొందరా తతంగానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మరి కొందరు తెల్లచీర, వెండిగాజులతో విజయ కన్పించగానే శోకాలు పెట్టడానికి సిద్ధమవుతున్నారు. కానీ నేనాతతంగాన్ని సాగనీయలేదు. “తాళి, మట్టెలు తీస్తుంది కానీ బొట్టుగాజులు తీయడానికి” వీల్లేదన్నాను.

బంధువులందరూ ‘ఆచారాలు సాంప్రదాయాలు’ అంటూ గగ్గోలు పెట్టారు. నువ్వో విడ్డూరపు మనిషివి అన్నాడు మా ఆయన.


“మీ ఆచారాలను సాంప్రదాయాలను మీ దగ్గరే పదిలంగా ఉంచుకోండన్నాను’ ’ కోపంగా.

అందరూ గోలగోలగా అరుస్తున్నారు. మరికొందరు నావైపు విడ్డూరంగా చూస్తున్నారు. విజయ మాత్రం ఎటూ తేల్చుకోలేక కన్నీళ్లు పెడుతూ పాపకు పాలిస్తూ ఓ మూలన కూర్చుండి పోయింది. ఇంక్కడ ఉండడం దుర్భరమనిపించింది. అందుకే విజ్జీని పిల్లలను తీసుకొని ఇంటికి బయల్దేరాను. మేం వచ్చేస్తుంటే ఎవరూ అడ్డు చెప్పలేదు. అమ్మాయి కూడా ఏమిటీ ఎక్కడికని ప్రశ్నించకుండా చేయి పట్టుకొని తీసుకొస్తుంటే బొమ్మలా వచ్చి ఆటోలో కూర్చుంది.

మేం ఇంటికి వచ్చిన గంట తర్వాత మా.ఆయనా, అత్తగారూ పిల్లలువచ్చేసారు. రాగానే మా ఆయన నామీద విరుచుకు పడ్డారు. నేనుబంధువులందరిలో తయనకు తలవంపులు తెచ్చానట. అల్లుడిగారి ఆత్మకు శాంతిలేకుండా చేసానట. ఇంకా, ఏమేమో అన్నారు. నేనేమీ మాట్లాడకుండా నన్నుకాదు అన్నట్లు ఉండిపోయాను. నా మౌనం ఆయన్నింకా రెచ్చగొట్టినట్టుంది. “అయినా నాకు చెప్పా పెట్టకుండా అమ్మాయిని నాయింటికి తీసుకొచ్చే అధికారం నీకెవరిచ్చారే”అన్నాడు కోపంగా

“ఈ యింట్లో ఉండొద్దు అని చెప్పండి ఈ క్షణమే నేను అమ్మాయిని తీసుకొని వెళ్ళిపోతాను” చాలా శాంతంగా చెప్పాన్నేను.

నా మాటలకు మా ఆయన అదిరిపోయారు నేనన్నింతపనీ చేస్తాను అనుకొని ఉంటాడు. అందుకే మౌనంగా ఉండి పోయాడు.




అలా కొన్ని రోజులు గడిచి పోయాయి. నేనెప్పుడూ అమ్మాయిని అంటిపెట్టుకొనే ఉండేదాన్ని. వంట చేస్తున్నప్పుడు తనను వంటింట్లో కూర్చో బెట్టుకొని కబుర్లు చెప్తూ వంటచేసేదాన్ని. తను దుఃఖం నుండి కాస్త తేరుకుంది. ఓ రోజు తనను వెంట బెట్టుకొని అల్లుడిగారి ఆఫీసుకు వెళ్లాను. ఆఫీసర్‌గారిని కల్సి అన్ని విషయాలు మాట్లాడాను. అతను ఏవేవో సంతకాలు తీసుకొని త్వరలోనే కబురు పెడతానన్నారు. కబురు కూడా వచ్చింది ‘ఉద్యోగంలో చేరమని’.

ఆరోజు మళ్లీ మా ఆయన గొడవ. “మొగుడు చచ్చిన దాన్ని ఏదో ఇంట్లో పడి ఉండనీయక ఉద్యోగమంటూ ఊరేగిస్తావా” అన్నాడు కోపంగా.

“అవును” చెప్పాన్నేను మామూలుగా.

“దానికుద్యోగం చేయాల్సిన ఖర్మేం పట్టిందే” దాన్ని చూసుకోవడానికి నేను లేనా అన్నారాయన.

“జీవితాంతం తోడుగా ఉంటాడని నమ్మిన మొగుడే దాన్ని నట్టేటముంచి పోయాడు. మరి మిమ్మల్నెలా నమ్ముకోమంటారు?” అడిగాన్నేను చాలా శాంతంగా.

మా ఆయన నిశ్చేష్టుడయ్యాడు. ఏదో అనబోయి నోరు తెరచి మళ్లీ అంతలోనే విరమించుకొని అక్కడనుండి వెళ్ళిపోయాడు.

విజయ ఉద్యోగంలో చేరేరోజు నేనెంత హడావుడి చేసానో. తను కట్టుకోవాల్సిన చీరను చక్కగా ఇస్త్రీ చేసాను. తను చీర కట్టుకుంటుంటే కుచ్చిళ్లు సర్దాను. తలస్నానం చేసిన జుట్టును చక్కగా దువ్వి జడవేసాను. తనకిష్టమైన టిఫిన్ చేసి కొసరి కొసరి తినిపించాను.పిల్లలను తయారు చేసి నేనూ తయారయ్యాను. నేనన్నీ చేస్తుంటే విజయ మాత్రం “అమ్మా! నాకేంటో దిగులుగా ఉందే” అని అంటూనే ఉంది. తనికి ధైర్యం చెప్తూ ఆటో ఎక్కేసాం. దిగులు పడ్తున్న తనకి ధైర్యం చెప్పి ఆఫీసలోకి పంపించి పాపను వళ్లో పడుకబెట్టుకొని ఆఫీసముందున్న చెట్టుకింది బెంచీమీద కూర్చున్నాను. బాబు అక్కడే గంతులేస్తు ఆడుతున్నాడు. ఓ గంట తర్వాత పాపకు పాలివ్వడానికి వచ్చిన విజ్జీ మొహంలో దిగులుస్థానే ధైర్యాన్ని చూసాను. భోజనం వేళలో ఇంటినుండి తిసికెళ్ళిన భోజనం బాబుకు తినిపిస్తూ మేమూ తిన్నాం. మాతోపాటు ఇద్దరు విజ్జీ సహోద్యుగులు వచ్చి చేశారు. అందరం సరదాగా.కబుర్లు చెప్పుకుంటూ భోజనం ముగించాం. ఆ రోజు సాయంత్రం ఆఫీసనుంచి ఆటోలో తిరిగి వస్తున్న నాకు విహారయాత్రకు వెళ్ళివస్తున్నట్లనిపించింది.

అలా ఓ రెండుమూడు రోజులు తనకు తోడుగా పిల్లల్ని తీసుకొని నేనూ వెళ్లాను. కానీ యిప్పుడు తనొక్కతే బస్‌లో వెళ్ళి వస్తోంది. పాపకు సీసాపాలు అలవాటు చేసాను. ఇప్పుడు నాకు స్తబ్దత అంటే ఏమిటో తెలియదు. ప్రతిక్షణం ఏదో ఓ పని తీరికలేకుండా చేస్తూనే ఉంటాను. ఇప్పుడు నాకు పనంటే విసుగులేదు. పనిలో యాంత్రికత లేదు. ఏ పనైనా ఉత్సాహంగా చేస్తూ ఉంటాను. నేనిప్పుడు పిల్లల పనులు మొక్కుబడిగా చేయడంలేదు. వాళ్ళను ఆడిస్తూ పాడిస్తూ ఎప్పుడూ సంతోషంగా ఉంటున్నాను. మధ్యాహ్నం భోజనాలయ్యాక పిల్లలను ఆడిస్తూ విజ్జీ చీరలు ఇస్త్రీ చేస్తూనో, చీరలకు ఎంబ్రాయిడరీ చేస్తూనో, ఫాల్స్‌కుడుతునో, పాప గౌనుకి లేసులు కుడుతూనో, లేక పిల్లలకు స్వెట్టర్లు అల్లుతూనో సాయంత్రం దాకా గడిపేస్తాను. సాయంత్రం అవుతూనే పిల్లలకు స్నానాలు చేయించి చక్కగా బట్టలు తొడిగి, తలలు దువ్వుతాను. వాళ్ళను చూస్తుంటే నా మనవడు మనవరాలు అని అస్సలు అన్పించదు నాకు. వాళ్లు నా బిడ్డలేనేమో అన్పిస్తారు. చాలా సార్లు నా పిల్లల బాల్యం గుర్తుతెస్తారు వాళ్లు. పాపను చూస్తుంటే చిన్నప్పటి విజ్జీనే గుర్తు వస్తుంటుంది.

ఆఫీస్‌నుంచి రాగానే విజ్జీ పిల్లలను ఎత్తుకొని ఆడించి ఆ తర్వాత స్నానం చేసి. నేను కలిపిచ్చిన కాఫీ త్రాగుతూ తన ఆఫీస్ కబుర్లూ, ఇంకా అవీ ఇవీ పేపర్లలో వచ్చిన వార్తలూ చెప్తూ ఉంటుంది. నాకా కబుర్లు వినాలంటే ఎంత సంతోషమో. అయినా విజ్జీ నుండి ఇలాంటి కబుర్లు వినాలనే కదా నేను కలలు కంది.

మొన్న విజ్జీ ఆఫీస్ నుండి వస్తూ ఏవో ఫారాలు తెచ్చుకుంది. నాకా ఫారాలు చూపిస్తూ "అమ్మా! నేను ఓపెన్ యూనివర్శిటీ ద్వారా డిగ్రీ చేయాలను కుంటున్నానమ్మా. డిగ్రీ చేస్తే ప్రమోషన్ కూడా వస్తుంది" అంటూ ఏదేదో చెప్పింది. దాని కళ్ళల్లో ఎంతో ఆత్మవిశ్వాసం. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు.

ఏమని వర్ణించను నా ఆనందాన్ని. విషయం తెలిసి మా ఆయన "ఉద్యోగం చేసేది చాలనట్టు ఇప్పుడు కాలేజీ చదువు కూడానా" అన్నాడు.




"చదువుకుంటే తప్పేంటీ! అయినా విజ్జీ ఇలా చదువు కోవాలనే నేను కలలు కంది. ఇలా ఉద్యోగం చేయాలనే నేను కోరుకుంది. నా కల ఫలించింది. నాకోరిక తీరింది. "అన్నాన్నేను ఉద్వేగంగా

మా ఆయన నావైపు విడ్డూరంగా చూస్తూ "నీ కల ఫలించిందని సంతోష పడుతున్నావు కానీ దానికి జరిగిన ఘోరం గురించి నువ్వాలోచించడం లేదు. ఆమె తన జీవితంలో అతి ముఖ్యమైనదాన్ని పోగొట్టుకుందనే విషయాన్ని నువ్వు విస్మరిస్తున్నావు. తనీ రోజు ఉద్యోగం చేస్తోందని ఆనందపడుతున్నావు కానీ ఆ ఉద్యోగం దాని మొగుడు చనిపోవడం వల్లే దానికొచ్చింది. అంటే పరోక్షంగా నువ్వల్లుడు చనిపోయినందుకు సంతోషిస్తున్నావా?" సూటిగా అడిగాడాయన.

నేను నిర్ఘాంతపోయాను. కొన్ని క్షణాల తర్వాత తేరుకొని "నేనలా ఎన్నడూ కోరుకోలేదు. అతను చనిపోయినపుడు నేను చాలా బాధపడ్డాను. కానీ విజ్జీ తన జీవితంలో అతి ముఖ్యమైనది పోగొట్టుకుందనే మీ మాటలతో నేనేకీభవించను. విజ్జీ తన భర్తను మాత్రమే పోగొట్టుకుంది. కానీ అంతకంటే విలువైన తన జీవితాన్ని మళ్లీ తన చేతుల్లోకి తీసుకుంది. అల్లుడు చనిపోయాడని నేను సంతోషించడం లేదు. అలాగని నా కూతురు జీవితంలో మనిషిగా బ్రతుకుతున్నందుకు నేను సంతోషిస్తున్నాను కూడా" చెప్పాన్నేను ఆవేశానికి లోను కాకుండా.

"అంటే ఏంటి! దానికి మొగుడక్కర్లేదు చదువు, ఉద్యోగం ఉంటే చాలంటావ్" విసురుగా అన్నాడు మా ఆయన.

"తనకేకాదు ఏ స్త్రీ కయినా భర్త, కుటుంబం అవసరంలేదని నేననడం లేదు. కానీ వాటితోపాటు తనకంటూ ఓ సొంత జీవితం కూడా ఉండి తీరాలి" ఖచ్చితంగా చెప్పాన్నేను.

"నువ్వో విడ్డూరపు మనిషివి. నీమాటలెప్పుడూ నాకర్థం కావు "నిరసనగా అంటూ వెళ్లిపోయాడు మా ఆయన అక్కడనుంచి.

ఏమిటీ ఆలోచిస్తున్నారు! మీక్కూడా నేను విడ్డూరపు మనిషిలాగే అన్పిస్తోన్నానా?